ప్రమాదాలు నివారిద్దాం.. సురక్షిత ప్రయాణాలు చేద్దాం

కుత్బుల్లాపూర్, జనవరి19 : ప్రతిఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలను పాటించి ప్రమాదాలను పూర్తిస్థాయిలో తగ్గించి సురక్షితమైన ప్రయాణాలు చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మేడ్చల్ జిల్లా రవాణాశాఖాధికారి కిషన్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా రవాణా శాఖాధికారులు, సిబ్బంది ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలను కొనసాగించిన వారికి గులాబీ పువ్వులను ఇచ్చి హెల్మెట్‌ను తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ రాజా, అధికారులు రవికుమార్, త్రివేణి, మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు,రేపు ఓటర్ నమోదు

కుత్బుల్లాపూర్, జనవరి 19 : ఓటర్ నమోదు కార్యక్రమాలు ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నర్సింహ, కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ కె.శ్రీహరి వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 18 ఏండ్లు నిండిన వారు ఫారం-6, ఓటర్, పోలింగ్ స్టేషన్ మార్పుకు ఫారం-8, ఓటర్ డిలీట్‌కు ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఆయా వార్డులు, కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారుల సమావేశంలో జడ్సీ స్నేహ శబరీష్

గుర్తించిన ప్రాంతాల్లోనే వ్యర్థాలు వేయాలి

శేరిలింగంపల్లి జడ్సీ స్నేహ శబరీష్

మియాపూర్, జనవరి 19 : గృహ నిర్మాణ వ్యర్థాల నిర్వహణ అత్యంత పకడ్బందీగా చేపట్టాలని, నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సిందేనని శేరిలింగంపల్లి జడ్సీ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణ వ్యర్థాల నిర్వహణపై పట్టణ ప్రణాళిక, రాంకీ, ట్రాఫిక్ పోలీస్ సహా ఇతర అనుబంధ విభాగాలతో జడ్సీ శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. గృహ నిర్మాణ వ్యర్థాలను వేసేందుకు జోన్‌లో నిర్ధారిత స్థలాలున్నాయని, అక్కడే వాటిని వేయాలని సూచించారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాల యజమానులు సైతం అధికారికంగా గుర్తించిన ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్థాలు వేయాలన్నారు. రాంకీ సంస్థ సైతం వ్యర్థాల తరలింపును చేపడుతున్నందున అధికారులు తగు పర్యవేక్షణ చేపట్టాలని జడ్సీ స్నేహ స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాల సేకరణపై తొలుత విస్తృతస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు జోన్‌లో కమిటీలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు జడ్సీ తెలిపారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో అందరి బాధ్యత ఉన్నదని, విస్మరించే వారిని ఉపేక్షించవద్దని జడ్సీ హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీ మల్లిఖార్జున్, ఏసీపీలు, డీసీలు, ట్రాఫిక్ అధికారులు, రాంకీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మాణ వ్యర్థాలు పారబోస్తే జరిమానా..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 19 : నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో అక్రమంగా పారబోస్తే(డంపింగ్ చేస్తే) భారీగా జరిమానా విధించడం జరుగుతుందని కూకట్‌పల్లి జడ్సీ అభిలాష హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ నిర్దేశించిన ప్రాంతాల్లో వ్యర్థాలను డంపింగ్ చేసి సంపూర్ణ స్వచ్ఛతకు సహకరించాలని కోరారు. జోన్ పరిధిలో పలు ప్రాంతాల్లో యూజర్ చార్జీలు చెల్లించకుండా ఉండటానికి ప్రైవేట్ ట్రక్కుల్లో నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా తీసుకొచ్చి ఎక్కడపడితే అక్కడ డంపింగ్ చేస్తున్నారన్నారు. దీని వలన పరిసరాలు అపరిశుభ్రంగా మారి, స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలో నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలను పారబోసేందుకు షాపూర్‌నగర్‌లోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను గుర్తించడం జరిగిందన్నారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్ల పరిధిలో వెలువడే నిర్మాణ వ్యర్థాలను ఈ కేంద్రంలో డంపింగ్ చేయాలని కోరారు. నిర్మాణ వ్యర్థాలు డంపింగ్ చేయాలంటే మూసాపేట, కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లకు చెందిన వారు లక్ష్మీరెడ్డి(8374478220), అల్వాల్ సర్కిల్ వారు శశివర్ధన్‌రెడ్డి (8712604625) ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భూ కబ్జాదారుడికి ఏడాది జైలు

జగద్గిరిగుట్ట, జనవరి 19: ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడిన వ్యక్తికి శిక్ష ఖరారైంది. జగద్గిరిగుట్ట సీఐ కాంత్రికుమార్ తెలిపిన వివరాల మేరకు..గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ నివాసముండే రమేశ్ నాయక్(46) ప్రభుత్వ భూమిలో కబ్జాలకు పాల్పడ్డాడు.కట్టమైసమ్మబస్తీలోని సర్వే నంబర్ 329/1లో భూమిని ప్లాట్లుగా మార్చి అమ్ముతూ మోసగించాడు. అక్రమ నిర్మాణాలకు పాల్పడగా 2019లో అప్పటి తహసీల్దారు గౌతమ్‌కుమార్ కూల్చివేతలు చేపట్టారు. దీంతో అధికారులపై రమేశ్ దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించాడు. రమేశ్ నాయక్ క్వారీగుంతలు పూడ్చి నోటరీ పేపర్లతో ఫోర్జరీకి పాల్పడుతూ పేదలను మోసగించాడు. దీంతో తహసీల్దార్ ఫిర్యాదుతో జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం కూకట్‌పల్లి మెట్రోపాలిటన్ కోర్టు కబ్జాదారుడికి శుక్రవారం జరిమానా, ఏడాది శిక్ష విధించింది.

బైక్ దొంగ అరెస్ట్..: బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్‌లో నివాసముండే మహేశ్ (19) కార్మికుడిగా పనిచేసేవాడు. జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదుచోట్ల బైక్‌ల చోరీ కేసుల్లో నిందితుడు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితున్ని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. వివరాలు వెల్లడయ్యాయి. అతడి నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు.

కాలనీల అభివృద్ధికి తోడ్పాటునందిస్తా : ఎమ్మెల్యే గాంధీ

సంక్రాంతిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి పూర్తి తోడ్పాటును అందిస్తానని, నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాబుమోహన్, మల్లేశ్, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, జనవరి 19

ఆపదలో అండగా సీఎంఆర్ఎఫ్

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 19 : అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు కష్టకాలంలో ప్రభుత్వం అండగా ఉంటుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట డివిజన్‌కు చెందిన అక్షయ్‌కుమార్‌కు రూ.లక్ష విలువ గల సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న పేదలకు తక్షణమే వైద్య సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలున్నారు.

ఘనంగా చిత్తారమ్మదేవి జాతర ప్రారంభం

దుండిగల్, జనవరి 19 : గాజులరామారంలోని చిత్తారమ్మదేవి జాతర ఘనంగా శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఉదయం 8గంటలకు గణపతి పూజతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అమ్మవారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవాలన్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, సభ్యులు ఆర్.బాలరాజు, ఎం.పెంటారెడ్డి, జి.నర్సింహ, ఆర్.నర్సింహ, ఆర్.సత్తయ్య, డి.ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జా నియంత్రించాలి

దుండిగల్, జనవరి19:కుత్బుల్లాపూర్ మండల పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ భూముల కబ్జాలను నియంత్రించాలని కోరుతూ మండల సీపీఐ కమిటీ శుక్రవారం గిర్ధావర్ రేణుకకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం, సూరారం, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో కొంతకాలంగా ప్రభుత్వ స్థలాల కబ్జాలు యధేచ్ఛగా సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా సర్వే నం.326, 329, 342లోని ప్రభుత్వ భూముల్లో నూతనంగా ఇండ్లు నిర్మించిన అక్రమార్కులు కోర్టు ఆర్డర్ ఉందంటూ మభ్యపెడుతున్నారన్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో కబ్జాలకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉమామహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్, నేతలు పాల్గొన్నారు.

పచ్చదనం పరిరక్షణకు కృషి

మియాపూర్, జనవరి 19 : గంజాయికి అలవాటు పడ్డ కొందరు ఆకతాయిలు పచ్చని ఉద్యానవనాన్ని పాడు చేస్తున్నారని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ అన్నారు. వారిపై చర్యలు తీసుకుని పచ్చదనం పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని ఫేజ్-2 బతుకమ్మ పార్కు పరిసరాలలో కొందరు యువకులు గంజాయి సేవిస్తూ అక్కడి చెట్లకు నిప్పు పెట్టడంతో పదుల సంఖ్యలో చెట్లు కాలిపోయాయన్నారు. ఈ ప్రాంతాన్ని అధికారులతో కలిసి కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏ నాగరాణి, పార్టీ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

మాదాపూర్, జనవరి 19 : మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్‌లో జూబ్లీహిల్స్ మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలు జరుగుతున్నాయని, ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగస్వర్ణ అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థుల ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్/ఆన్‌లైన్‌లో అప్లై చేసుకునేందుకు www.tmreistelangana. cgg.gov దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 5వ తరగతి, మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులకు, ఇంటర్ మొదటి సంవత్సరంలో (సీఈఈ, ఎంఈసీ) ముస్లిం మైనార్టీ (30 సీట్లు), నాన్ మైనార్టీ విద్యార్థులకు(10 సీట్లు) అవకాశం ఉందన్నారు. 6, 7, 8 తరగతులకు ముస్లిం మైనార్టీ అభ్యర్థులు మాత్రమే అప్లై చేసుకోవాలని, మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్‌లోని పాఠశాలలో అప్లికేషన్లు లభిస్తాయని, వివరాలకు 9703296221, 7995057898లో సంప్రదించాలని సూచించారు. పాఠశాలలో ఉచిత విద్య, వసతి భోజనం, యూనిఫాం, పుస్తకాలు, కాస్మోటిక్ కిట్స్ ఉచితంగా అందిస్తామన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేత

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పేదలకు మెరుగైన వైద్యం అందడంతో పాటు సర్కారు దవాఖానాలను మరింత పటిష్టపరిచేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.

– మియాపూర్, జనవరి 19

భవనం పైనుంచి పడి యువకుడు మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 19 : భవనం పైనుంచి కింద పడిన యువకుడు మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన దేవబ్రత్ బెహరా(18) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని భగతసింగ్‌నగర్ ఫేజ్-2 లోని ఓ ఇంట్లో ఈనెల 18న దేవబ్రత్ బెహరాతో కలిసి మరో ఇద్దరు ఫాల్‌సిలింగ్ పనులు చేసి పడుకున్నారు. రాత్రి సమయంలో దేవబ్రత్ బెహరా ఒక్కడే లేచి ఫోన్ చార్జింగ్ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి మృతి చెందాడు. 19న ఉదయం తోటి కార్మికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దేవబ్రత్ బెహరా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

బౌరంపేట్ పీఏసీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్, జనవరి 19 : బౌరంపేట్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు తన కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నల్తూరి క్రిష్ణ, కార్యదర్శి సయ్యద్ అసదుల్లా, డైరెక్టర్లు, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

– ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, ప్రజలు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మహిళల జీవనోపాధికి నిర్మాణ్ స్కిల్ సెంటర్ చేయూత

సిద్ధిక్‌నగర్‌లో నిర్మాణ్ స్కిల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

కొండాపూర్, జనవరి 19 : మహిళల జీవనోపాధిని/ఆదాయ ఉత్పత్తిని మెరుగుపర్చేందుకు పెగాసిస్టమ్స్ మద్దతుతో ఏర్పాటు చేసిన 'నిర్మాణ్ స్కిల్ సెంటర్' చేయూతగా నిలుస్తుందని ఇండియా, ఇంటర్నేషనల్ లా కమర్షియల్ లా లీడ్ కౌన్సిల్ ధరణికోట సుయోధన్ అన్నారు. పెగా సిస్టమ్స్ మద్దతుతో, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా నిర్మాణ్ స్కిల్ సెంటర్‌ను శుక్రవారం గచ్చిబౌలిలోని సిద్ధిక్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా 52 మంది మహిళలు కుట్టు మిషిన్‌లో ప్రత్యేక శిక్షణ పొందనున్నట్లు తెలిపారు. అత్యాధునిక రకాల డిజైన్లలో శిక్షణను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోటరీక్లబ్ వారు స్కిల్ సెంటర్ భవన ఏర్పాటుకు సహకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ ప్రచా, మయూర్ పంతల, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE (DOCUMENT LOST)

My client **TALSANI RAVI KIRAN,** S/o. T. MOHAN REDDY, R/o. Hyderabad, T.S. has lost Original registered Sale Deed document No.8250/2010, registered at R.O. Ranga Reddy relevant to the property bearing **Residential Flat No.402,** in 4th Floor, with a built up area of **1523 Sq. Ft** (including Common area) and One Car Parking, undivided share of Land admeasuring **52.53 Sq. Yds** (out of 888 Sq. Yds) on open Land in Sy. No. 24, in the Building Known as **"VALLEY APARTMENTS",** Situated at **GACHIBOWLI (V),** Serilingampally (M) & GHMC, RR Dist., T.S. and the above said Original Sale Deed was lost while my client was travelling by Auto from Sarath City Capital Mall (AMB Mall), Kothaguda towards Gachibowli as on 14th January 2024. Later my client identified that he lost the above said Original registered Sale Deed Document, Vide Document No. 8250/2010 relevant to the above said Property and my client put his best efforts but he is unable to trace out the above said original registered Sale Deed document and it is lost beyond recovery. Hence I hereby intimate to the General Public that if any person found the above said original registered sale Deed document kindly contact below mentioned name and address on or before **five (5) days** from the date of this publication.

Sd/- **S.VENKAT RAO,** M.Com, LL.B.
ADVOCATE
Plot No. 1, KONDAPUR "X" ROAD,
SERILINGAMPALLY, HYDERABAD.
Cell: 9848247466

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

దుండిగల్, జనవరి 19 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలతో పాటు దుండిగల్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

అల్లాపూర్, జనవరి 19 : మోతీనగర్ కబీర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోసెఫ్ కెరిటన్ అన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఉచిత వైద్య శిబిరంలో బీపి, షుగర్ పరీక్షలతోపాటు ఈసీజీ, కంటి పరీక్షలు, వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బసవయ్య, డాక్టర్ మౌనికరెడ్డి, బస్తీవాసులు మాధవరెడ్డి, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడు లతీఫ్ ఆచూకీ తెలపండి

బాలానగర్, జనవరి 19 : కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తుడు ఎండీ అబ్దల్ లతీఫ్ ఆచూకి ఎవరికైనా తెలిస్తే బాలానగర్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కె. భాస్కర్ కోరారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం....మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఎండీ అబ్దల్ లతీఫ్ అలియాస్ అయూబ్ (45) బేగంపేటలోని ఆధునిక సెక్యూరిటీ మ్యానేజ్‌మెంట్ సర్వీసెస్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తు శోభనకాలనీ అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో పని చేసేవాడు. 2011లో నమోదైన పలు కేసులలో కోర్ట్ ఎండీ అబ్దల్ లతీఫ్‌ను నిందితుడుగా గుర్తించింది. గత కొద్ది రోజులుగా కోర్టుకు హాజరుకాకుండా తప్పింయుకు తిరుగుతున్న నిందితుడిని న్యాయస్థానంలో హాజరు పరచాలని కోర్ట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బాలానగర్ పోలీసులు ప్రకటన విడుదల చేశారు.

ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

సుభాష్‌నగర్ డివిజన్‌లో పర్యటించి ప్రజలను పలకరిస్తున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

జీడిమెట్ల, జనవరి 19 : అభివృద్ధికి మరోసారి పట్టం కడుతూ అఖండ మెజార్టీని అందించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా శుక్రవారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని గంపలబస్తీ, రాంరెడ్డినగర్, డీపీ కాలనీ, ఎస్.ఆర్.నాయక్‌నగర్, అపురూప కాలనీ, మోడీ బిల్డర్స్, జనప్రియ సాయి నెస్ట్ అపార్టుమెంట్స్‌లో పర్యటించి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించడంతో నాపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రజలు అందించిన ఈ గెలుపుతో రెట్టింపు ఉత్సాహంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి.హేమలత సురేశ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా ఫిషరీష్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కౌన్సిలర్ రంగారావు, సీనియర్ నాయకులు ఎం.ఎస్.వాసు, గుబ్బల లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్, జనవరి 19 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యలను సకాలంలో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గానికి చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, మహిళలు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలపై నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, జనవరి 19 : ఓ గృహిణి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాంనారాయణ కథనం ప్రకారం.. కుత్బుల్లాపూర్ ఎరోనాటికల్ ఎంక్లేవ్‌లో నివాసం ఉంటున్న జామల కళావతి కూతురు గాజుల సాయిచి(26) తన భర్త సన్నితో గత కొన్నేండ్ల కిందట భర్తతో వివాదం చోటుచేసుకోవడంతో తల్లి వద్దకు వచ్చి ఉంటుంది. గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేట్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

దుండిగల్,జనవరి 19 : ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో వెలసిన పలు అక్రమ నిర్మాణాలను బాచుపల్లి తహసీల్దార్, అధికారులు శుక్రవారం కూల్చివేశారు. బాచుపల్లి మండలం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేట్‌లోని సర్వేనంబర్ 334 అసైన్డ్ భూముల్లో గత కొంతకాలంగా అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో శుక్రవారం గిర్ధావర్ శెర్పాల్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆ భూముల్లో వెలసిన మూడు గదులు, నాలుగు బేస్‌మెంట్లను జేసీబీతో కూల్చివేశారు.

చైన్ స్నాచర్ అరెస్టు

మూసాపేట, జనవరి19: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరారైన ముగ్గురి నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. కూకట్‌పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఈనెల 17న రాత్రి 11గంటల సమయంలో శివచంద్ తన పని ముగించుకుని కూకట్‌పల్లి పరిధి భాగ్యనగర్‌కాలనీలో నడుచుకుంటూ